రాజా బహదూర్ వెంకట్రామారెడ్డికి నివాళి


సమావేశంలో ప్రొఫెసర్ కిషన్‌రావు

కాచిగూడ: ఆధునిక తెలంగాణ వైతాళికుడు రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి అని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌రావు అన్నారు. రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం వెంకట్రామారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెంకట్రామారెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కవిత, కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, హెచ్‌ఎంవీఎస్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, డాక్టర్ వై.జయంతి తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వైఎంసీఏ చౌరస్తాలో..

రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి విగ్రహానికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నగరాభివృద్ధికి వెంకట్రామారెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశా

ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గాన్ని తాను అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తన పనితీరును, అభివృద్ధిని చూసే సీఎం కేసీఆర్ మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించారని తెలిపారు. మంగళవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో రెండవసారి ముఠా గోపాల్‌కు ఎమ్మెల్యే టికెట్ లభించినందుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బబ్లూతో కలిసి పార్కు అంతా కలియ తిరిగి వాకర్స్‌కు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ఇటీవల రూ.400 కోట్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు. ముషీరాబాద్ ప్రజలు మరోమారు తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీవీ నిరంజన్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షులు వెంకటకృష్ణరావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఐయిలినేని కిషన్‌రావు, ఉపాధ్యక్షులు సంతోష్‌గౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మోజెస్, మన్నె దామోదర్‌రెడ్డి, రఫీ అహ్మద్, బి.నాగభూషణం, ఆర్.వివేక్ తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య పార్కులో ముఠా గోపాల్‌ను అభినందిస్తున్న వాకర్స్ సభ్యులు

క్లుప్తంగా

అభినందనలు



కాచిగూడ: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించడంపై బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ పటేల్, నందగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. అంబర్‌పేట టికెట్‌ను పార్టీ అధిష్టానం, సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల మంగళవారం కాలేరు వెంకటేష్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వారు కలిసి మద్దతు ప్రకటించారు. మరోసారి వచ్చే ఎన్నికల్లో కాలేరు వెంకటేష్ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అంబర్‌పేటలో అవకాశం కల్పించండి


మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ అంబర్‌పేట టికెట్ ప్రకటనపై సీఎం కేసీఆర్ పునరాలోచించుకోవాలని ఆ పార్టీ మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి కోరారు. మంగళవారం అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వందలాది మహిళలతో ఆమె సమావేశమై తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. నియోజకవర్గంలో మహిళలతో పాటు తన కుటుంబానికి ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ తనకు అవకాశం ఇవ్వాలని ఆమె కారారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సదస్సు వాయిదా

కాచిగూడ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియ చివరి దశలో ఉందని సీఎం కేసీఆర్ చెప్పిన విషయాన్ని తాము మరోసారి నమ్ముతున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధానకార్యదర్శి బసవపున్నయ్య తెలిపారు. సీఎం కేసీఆర్ మాటను గౌరవిస్తూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఈనెల 24న తలపెట్టిన రాష్ట్ర స్థాయి సదస్సును కొద్ది రోజులు వాయిదా వేస్తున్నట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు.

కవితకు కృతజ్ఞతలు తెలిపిన ముఠా గోపాల్



ముషీరాబాద్: ఎమ్మెల్యే ముఠా గోపాల్ మంగళవారం ఎమ్మెల్సీ కవితకు ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున మూడవసారి పోటీ చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్‌ఎస్ ధ్యేయం



చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్‌ఎస్ ధ్యేయం బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్ వీవీగిరినగర్ బస్తీ ప్రజలు కోరిక మేరకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ బోర్‌వేల్‌ను మంజూరు చేయించారు. మంగళవారం ముఠా జయసింహ బోర్‌వెల్ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముందున్నారని చెప్పారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, శ్రీనివాస్‌గుప్తా, జగదీశ్‌బాబు, ఎస్త్రీపేమ్, ఎంబీ కృష్ణ, అజయ్, శివ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు వినతి

లాలాపేట: తార్నాకలోని హెచ్‌ఎండీఏ కాంప్లెక్స్ నుంచి ఓయూ క్యాంపస్‌లోనికి వెళ్లే గేటును తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని నాగార్జుననగర్ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉదయం వేళ వాకింగ్‌కు వెళ్లాలంటే చాలా దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఉదయం మూడు గంటల పాటు గేటు తెరిచి ఉంచేలా అధికారులతో మాట్లాడాలని కోరారు.

మహనీయుల స్ఫూర్తితో ప్రజా సేవ

అంబర్‌పేట: మహనీయుల స్ఫూర్తితో ప్రజా సేవలో పాలుపంచుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం కేసీఆర్ పార్టీ టికెట్ ప్రకటించడంతో ఆయన మంగళవారం నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా శ్రీరమణ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహానికి ఆయన పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. తొమ్మిది మందికి మంజూరైన రూ.8.40 లక్షల చెక్కులను అందించి భరోసా ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్‌వర్క్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి, ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. వాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్సీ కవిత, కనీస వేతనాల సలహామండలి చైర్మన్ నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాటర్ బోర్డు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఔట్‌సోర్సింగ్ కార్మికులను గుర్తించి జీవో 60 ద్వారా వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తూ పీఆర్‌సీలో భాగస్వాములు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్, ఉపాధ్యక్షులు వేముల మారయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, రమేష్, బాబా, బాబురావు, యాదగిరి, అమృత పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

చిక్కడపల్లి: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం రెండుసార్లు యూనియన్లతో చర్చలు జరిపినా మొండి వైఖరి వీడలేదన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలందరిని డైరెక్ట్‌గా రెగ్యులర్ చేయడానికి అవకాశాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టకుండా మొండిగా రాత పరీక్ష ద్వారానే రిక్రూట్మెంట్ చేస్తామంటున్నదన్నారు. యూనియన్ కోశాధికారి కవిత, కిరణ్మయి, రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజీ, విజయ, ప్రణయశీల పాల్గొన్నారు.


క్రాస్‌రోడ్‌లో మానవహారంతో నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు


రాబోయే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితాను ప్రకటించిన నేపథ్యంలో ప్రగతి భవన్‌లో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్, ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

అంబర్‌పేట: విద్యార్థులను క్రీడల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో పాఠశాల విద్యార్థులకు క్రీడా టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులను చదువుల పేరిట మానసిక ఒత్తిడి తేవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు ఖాజా నిజామ్‌ఉద్దీన్, ఎం.శ్యాముయేల్‌రాజ్, లక్ష్మణ్‌సింగ్, నిర్వాహకులు సోమశేఖర్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్ జలమండలి సెక్షన్ మేనేజర్ సస్పెన్షన్

ముషీరాబాద్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనకు విరుద్ధంగా నిర్వహించారనే కారణంగా ముషీరాబాద్ జలమండలి సెక్షన్ మేనేజర్ నవీన్‌ను జలమండలి ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. చిలకలగూడ రిజర్వాయర్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు రిజర్వాయర్ ట్యాంక్ కప్పు పై మినీ జేసీబీతో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఈ యంత్రం ట్యాంక్‌లో పడిపోయింది. వెంటనే ట్యాంక్‌లో నుంచి క్రేన్ సాయంతో జేసీబీ యంత్రాన్ని బయటకు తీశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విధుల్లో నిర్లక్ష్యం వహించిన సెక్షన్ మేనేజర్ నవీన్‌ను సస్పెండ్ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పురా–మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఐనోన్ చర్చి వార్షికోత్సవాలు

లాలాపేట: తార్నాకలోని ఐనోన్ చర్చి 34వ వార్షిక మహోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్.విలియం కేరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయ డెయిరీ సమీపంలో ఉన్న చర్చిలో సాయంత్రం 6 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు.

బీసీ సీఎం సాధన సమితి ఏర్పాటు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి ఏర్పాటు చేసినట్లు ఓయూ న్యాయకళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణకు బీసీ సీఎం కావాలనే లక్ష్యంతో రెండేళ్లుగా పని చేసిన సదరన్ పొలిటికల్ అకాడమీని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితిగా మార్చినట్లు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలోను తెలంగాణ ఏర్పాటు తర్వాత 52 శాతం గల బీసీలు ముఖ్యమంత్రి పదవీ చేపట్టలేదన్నారు. బీసీని ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ఏడేళ్ల సర్వీసు ఉన్న ప్రొఫెసర్ ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసినట్లు వెల్లడించారు.

అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

అడ్డగుట్ట: సరూర్‌నగర్ మండల పరిధిలోని నందనవనంలో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యువకులందరూ మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడుతూ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, తక్షణమే మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించి బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కారు ఢీకొని యాచకుడి మృతి

లాలాపేట: కారు ఢీకొని యాచకుడు మృతి చెందిన ఘటన ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. ఈనెల 21న ఏకో కార్ స్పోర్ట్స్ డ్రైవర్ తార్నాక చౌరస్తాలోని పెట్రోల్ వేసుకుని వెళ్తున్న క్రమంలో 60 ఏళ్ల యాచకుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించడమే ముదిరాజ్‌ల లక్ష్యం


మాట్లాడుతున్న సతీష్‌ముదిరాజ్

కాచిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన 115 అసెంబ్లీ అభ్యర్థుల్లో ముదిరాజ్ కులానికి చెందిన ఏ ఒక్కరికీ సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించలేదని అంబర్‌పేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈత సతీష్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి ఎం.బి.కిషోర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం కాచిగూడ, నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు ఒక్కసీటు కూడా కేటాయించకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌కు మార్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డోర్నాల భరత్ రాజ్ ముదిరాజ్, బుచ్చయ్య ముదిరాజ్, గంట లక్ష్మణ్ ముదిరాజ్, బంటు సురేందర్ ముదిరాజ్, తిరుపతి ముదిరాజ్, డి.అనిరుద్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను తనకు కేటాయించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లబెల్లి అంజిరెడ్డి గాంధీభవన్‌లో మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. రూ.50 వేల డీడీ, తన బయోడేటా కాపీని సమర్పించారు. 33 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిగా, హైదరాబాద్ సిటీ కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా పని చేశానని, 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పించాలని భోలక్‌పూర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో తెలియజేశారు.


గాంధీభవన్‌లో దరఖాస్తు రసీదు అందుకుంటున్న అంజిరెడ్డి

ముఠా గోపాల్‌కు అభినందనలు


ముఠా గోపాల్, ముఠా జైసింహను అభినందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌ను మూడవ సారి దక్కించుకున్న ముఠా గోపాల్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ముషీరాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పార్సిగుట్ట చౌరస్తాలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, సోమ సుందర్, ట్రేడ్ సెల్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, శివముదిరాజ్, బల్లా ప్రశాంత్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సుపరిపాలనే లక్ష్యం

కాచిగూడ: అవినీతి రహిత సుపరిపాలనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని ఉత్తరప్రదేశ్, సహరనపూర్ నగర్ ఎమ్మెల్యే రాజీవ్ గుంభార అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలందరూ సంఘటితంగా కార్యక్రమాలు చేపడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, వెంకట్‌రెడ్డి, శైలేందర్, శ్యామ్‌రాజ్, బి.భీమ్‌రాజ్, సుభాష్ పటేల్, హజారిబాబు, కృష్ణకుమార్, శేర్‌సాగర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్, సహరనపూర్ నగర్ ఎమ్మెల్యే రాజీవ్ గుంభార

ఎంఎస్ దారెటు..?


ఎంఎస్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన వారిలో గ్రేటర్ సీనియర్ నాయకులు ఎం.ఎస్.శ్రీనివాస్‌రావు ఒకరు. ప్రతి ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా టికెట్ దక్కకుండాపోయింది. తీవ్ర నిరుత్సాహానికి గురైన ఎంఎస్‌కు పలు పార్టీల నుంచి టికెట్ ఇస్తామని తమ పార్టీలో చేరాలని అవకాశాలు తలుపు తడుతున్నట్లు తెలుస్తుంది. ఎంఎస్ శ్రీనివాస్‌రావుకు తెలుగు దేశం పార్టీలో సుమారు 30 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉంది. ముషీరాబాద్ నియోజకవర్గంలో ముఠా గోపాల్, ఎంఎస్ శ్రీనివాస్‌రావు రెండు వర్గాలుగా ఎన్నో ఏళ్లు పోటీపడి పని చేశారు. పెద్దల ఆహ్వానంతో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంఎస్ రాజకీయ భవిష్యత్ ప్రస్తుతం అఘమ్యఘోచరంగా తయారయ్యింది. రాజకీయ చరమంకంలో ఉన్న ఎంఎస్ ఒకసారి పార్టీ పెద్దలను కలిసి తనను పార్టీలోకి ఎందుకు ఆహ్వానించారని అడిగే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆ అవకాశం రాకపోతే తనకు ఆహ్వానం పలుకుతున్న బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలలో ఏదో ఒక పార్టీ నుంచి టికెట్ దక్కించుకోని ముషీరాబాద్ లేదా కంటోన్మెంట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

కేసీఆర్, కేటీఆర్‌తోనే మాట్లాడుతా..


శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్ టికెట్ ఆశిస్తున్న వారిలో నాయిని నర్సింహారెడ్డి అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు. ఆయనను 'సాక్షి'సంప్రదించగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని పార్టీకి వ్యతిరేకంగా కామెంట్ చేసే ఉద్దేశం తనకు లేదని తేల్చి చెప్పారు. ముషీరాబాద్‌లో నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి నాయిని నర్సింహారెడ్డి పేరు పెట్టినందుకు కేసీఆర్‌ను కుటుంబ సమేతంగా కలవాలనుకుంటున్నాం. తన రాజకీయ భవిష్యత్తు గురించి కూడా అప్పుడే మాట్లాడుతా. అలాగే అమెరికా నుంచి కేటీఆర్ వచ్చిన తర్వాత ఆయనను కూడా కలిసి చర్చిస్తా అని 'సాక్షి'కి వివరించారు.

'ఆత్మ' కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాచిగూడ: ఆత్మ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి తమ కుటుంబాకు భరోసా ఇవ్వాలని తెలంగాణ ఆత్మ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదావత్ కృష్ణ నాయక్, ట్రెజరర్ జ్యోతిలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తాము పదేళ్లుగా అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆత్మలో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. 10 ఏళ్ల నుంచి రైతులకు సేవ చేస్తున్న తమను కూడా రెగ్యులర్ చేసి జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు.


వినోద్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన ఉద్యోగులు